

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి కారుమూరి

తణుకు : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాలశాఖమంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని 29వ వార్డు సజ్జాపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలవుతున్న విధానంపై ఆరా తీశారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ తదితర సమస్యలు మంత్రి దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై తక్షణం స్పందించి సంబంధిత అధికారులను ఆదేశించారు. మూడున్నర సంవత్సరాల కాలంలో అమ్మఒడి, కాపునేస్తం, చేయూత వంటి సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో ఖర్చుచేస్తుందని చెప్పారు. ఇంకా ఎవరైనా లబ్ధిదారులుంటే వారిని కూడా సంక్షేమ పథకాల్లో భాగస్వాములను చేయాలన్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని సంక్షేమ కార్యక్రమాల అమలు సక్రమంగా జరుగుతుందని చెప్పారు.

కల్లంలోనే కొనుగోళ్లు.. ఆచరణ సాధ్యమేనా..!

ప్రొక్యూర్‌మెంట్ విధానంలో ధాన్యం కొనుగోలు

దళారులను అరికట్టడం సాధ్యమేనా

సర్కార్ ప్రణాళికలు ఆచరణకు సాధ్యం కాదంటున్న మిల్లర్లు

తేమశాతం నిబంధనల సడలించాలి : రైతులు

మద్దతు ధర కల్పించి, సకాలంలో సొమ్ములివ్వాలని డిమాండ్



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొత్త సీసాలో పాత నీరు పోసిన విధంగా ఉంది సర్కారు తీరు. ఏటా ఇబ్బందులతో మొదలవుతూ.. ఇబ్బందులతోనే ముగుస్తున్న ధాన్యం కొనుగోలు విషయంలో సర్కారు పాతమాటనే కొత్తగా చెప్పుకొచ్చింది. రైతు కల్లంలోనే ధాన్యం కొనుగోలు విషయంలో దళారుల, మిల్లర్ల పాత్ర లేకుండానే రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ అంటూ కొత్తగా చెప్పుకొచ్చింది. కానీ ఎప్పటిమాదిరిగానే ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో వారి ఖాతాల్లో నగదును జమ చేస్తామని చెప్పడం గమనార్హం.

ఏటా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు జరగక ముందే రైతుల వద్దనున్న ధాన్యాన్ని దళారులు, పలువురు మిల్లర్లు తమ అడ్డాలోకి తరలించుకుపోవడం ఆనవాయితీగా వస్తోంది. సర్కార్ చెప్పిన మాదిరిగానే రైతుల బ్యాంకు ఖాతాల్లో ధాన్యం డబ్బులు పడినా వాటిని తీసుకునే హక్కు వారికి ఉండదన్నది అందరికీ తెలిసిన విషయమే. ఎందుకంటే అప్పటికే నగదు విత్ డ్రా ఫారంపై రైతు సంతకం/వేలిముద్ర తంతు పూర్తయి పాస్‌బుక్‌తో సహా దళారులు, పలువురు మిల్లర్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. ఇదంతా ఒక ఎత్తయితే ఏటా మళ్లీమళ్లీ మిల్లర్ల వద్దకే చేరుతున్న బియ్యాన్ని మరపట్టి తిరిగి లెవీగా సర్కారుకే మిల్లర్లు చేరవేస్తున్నారు. రైతుల వద్దనుంచి సేకరించిన ధాన్యాన్ని ఆరునెలల వరకూ నిల్వ ఉంచి ఆ తర్వాత వాటిని ఆడించి బహిరంగ మార్కెట్‌లో అధికధరకు విక్రయించుకుంటూ మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా సర్కారుకు తెలిసే జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. ఈ ఏడాది 3.8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దానికిగానూ ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో సేకరించడానికి జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఆదేశాలు జారీ చేశారు. ఈ విధానం వల్ల ఆఖరి నిమిషం వరకూ ఏ రైతుకు చెందిన ధాన్యం ఏ మిల్లుకు చేరుతుందో? తెలియదని, దానివల్ల రైతులు దళారుల బారిన పడకుండా ఉంటారని చెప్పారు. దీనికి సంబంధించి ప్రత్యేకసెల్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేకించి అధికారుల బృందాన్ని కూడా నియమించారు. ఈ ధాన్యం సేకరణకుగానూ మిల్లర్ల వద్ద 50 లక్షల గోనెసంచులు, మరో పదిలక్షలు పౌరసరఫరాల వద్ద సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కొనుగోలు పురోగతిని ఎప్పటికప్పుడు సీఎం కార్యాలయ వర్గాలు పరిశీలిస్తుంటాయని అధికారులు చెబుతున్నారు. రైతుల నుంచి ధాన్యం నేరుగా వే బ్రిడ్జికి వెళుతుందని అక్కడ నుంచి ర్యాండమ్ పద్ధతిలో కేటాయించిన రైస్ మిల్లుకు ధాన్యం చేరుతుందని, మిల్లర్లకు సంబంధించి బ్యాంకు గ్యారంటీ విషయంలో ఉన్నతస్థాయి అధికారులతో చర్చించామని, సానుకూల దృక్పథం వచ్చిందని జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్నారు. అలాగే తేమ శాతం 17 కంటే తక్కువ ఉండాలని, పొలంలో రైతు ఆరబెట్టిన ధాన్యాన్ని సేకరించి వే బ్రిడ్జికి తీసుకువెళ్లి తూకం వేసి ఎఫ్‌టిఒ జనరేట్ చేస్తారు. అక్కడ నుండి ఆయా రైస్ మిల్లులకు ధాన్యం రవాణా అవుతుంది. ఈ విషయంలో వాలంటీర్ రైతు సహాయకుడిగా పనిచేస్తారు. అయితే ఇప్పటికే ప్రతీ మండలంలో వే బ్రిడ్జిలను అధికారులు గుర్తించారు.

నిబంధనలు సడలించాలి

ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానంలో కొన్ని నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా పరిణమించాయి. తేమశాతం 17 మించకుండా ఉండాలని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇదిసాధ్యం కాదు. ఈ నిబంధనను సడలించాలని రైతులు కోరుతున్నారు. అలాగే ప్రతీసారి ధాన్యం కొనుగోలులో రైతులను గోనె సంచుల కొరత వెంటాడుతోంది. ఈ సారైనా సరిపడు గోనె సంచులను రైతులకు అందించాలని కోరుతున్నారు.

సకాలంలో సొమ్ములు అదేనా?

ధాన్యం సొమ్ముల చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్న మాటలకు, ఆచరణకు పొంతన ఉండటం లేదు. ధాన్యం సేకరించిన 21 రోజుల్లో సొమ్ములను రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఎప్పటికప్పుడు చెబుతూనే ఉన్నారు. కానీ ఇది ఎక్కడా కూడా అమలుకావడం లేదు. నెలల తరబడి ధాన్యం సొమ్ములు పెండింగ్‌లో పెట్టిన పరిస్థితులు జిల్లాలో ఉన్నాయి. ఎప్పటిలాగానే ఈ ఖరీఫ్‌లోనూ 21 రోజుల్లో సొమ్ములు కచ్చితంగా జమ చేస్తామని చెబుతున్నారు. ఏది ఏమైనా రైతులు అమ్మిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించి సకాలంలో సొమ్ము చెల్లించాలని కోరుతున్నారు.

దళారులను నిరోధించగలరా..?

అయితే ఇదంతా బాగానే ఉన్నా దళారులను నిరోధించగలరా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏటా అధికారులు ఈ ధాన్యం కొనుగోలు విషయంలో ఎన్ని ప్రకటనలు చేసినా దళారులు మాత్రం తమదైనరీతిలో రైతులను నిలువునా మోసం చేస్తున్నారనే విషయం తెలిసిందే. చాలామంది రైతులు సాగు చేయడానికి అధికమొత్తంలో వడ్డీకి పెట్టుబడిని తీసుకొస్తుంటారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత రైతుల ఖాతాల్లోకి నగదును జమ చేయడంలో జాప్యం జరుగుతుండడం పరిపాటిగా మారుతోంది. దీంతో రైతులు అందినకాడికి దళారులకు అమ్ముకుని ముందుగానే డబ్బులు తీసుకుని అప్పులు చెల్లించుకోవడం పరిపాటిగా మరుతోంది. మరి ఇలాంటి తరుణంలో ఈసారి అటువంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే రైతులకు అనుకున్న సమయానికి నగదును వారి ఖాతాల్లో జమ చేయాలని పలువురు చెబుతున్నారు.

ధాన్యం సేకరణలో నూతన విధానం.. నష్టం

ధాన్యం సేకరణలో నూతన విధానం వల్ల సొసైటీలు నష్టాల్లోకి వెళ్తాయని ఇటీవల జరిగిన జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశం పేర్కొంది. సహకార సంఘాలు నష్టాల్లోకి వెళ్తాయని, కొత్త నిబంధనల వల్ల కార్యదర్శికి పూర్తి బాధ్యత ఇవ్వడంతో ఏదైనా పొరపాటు జరిగితే పోలీసులు కేసులు బనాయిస్తారని, కార్యదర్శులు ఆందోళన చెందుతారని వివరించింది. అలాగే నిర్మించిన గోదాములు 30 సంవత్సరాల్లో 30 వాయిదాల్లో బాకీ తీర్చాలి, తరువాత గోదామును ప్రభుత్వానికి అప్పగించాలి, ఈ గోదాములపై సహకార సంఘాలకు ఏ విధమైన హక్కులుండవు ఇది కేవలం సహకార సంఘాలను నష్టాల్లోకి నెట్టి వేయడం తప్ప మరొకటి కాదని తెలుస్తోంది.

బతుకులు బుగ్గి



కూలీల మృతదేహాలు

బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు

ఐదుగురు దుర్మరణం

ఛిద్రమైన మృతదేహాలు

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

ఉలిక్కిపడ్డ గ్రామస్తులు

ఒక్కో కుటుంబానికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సిఎం జగన్

తాడేపల్లిగూడెం మండలం కడియద్దలో ఘటన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

వారంతా నిరుపేదలు.. రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు.. పొట్టకూటి కోసం ప్రమాదకర ప్రదేశాల్లో పనులకు సైతం వెళ్తుంటారు. ఈ క్రమంలో బాణసంచా తయారీ పనులకు వెళ్లారు. అక్కడ జరిగిన భారీ విస్ఫోటనానికి ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలోఉన్నారు. ఈ విషాద ఘటన తాడేపల్లిగూడెం మండలం కడియద్ద గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం కడియద్దలో గుట్టుచప్పుడు కాకుండా అన్నవరం అనే వ్యక్తి దీపావళి మందుగుండు తయారీ కర్మాగారం నిర్వహిస్తున్నాడు. ఇక్కడ పనిచేసేందుకు చుట్టుపక్కల గ్రామాలైన ఊనగట్ల, జగ్గన్నపేట, కడియద్దకు చెందిన నిరుపేదలు పనిచేసేందుకు నిత్యం వస్తుంటారు. ఈ క్రమంలో గురువారం ఉదయం కొంతమంది కూలీలు పనిచేసేందుకు వచ్చారు. రాత్రి సమయంలోకూడా బాణసంచా తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రాత్రి ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో బాణసంచా మందుగుండు సామగ్రి తీవ్రతకు షెడ్డు గోడలు పగిలిపోయి పూర్తిగా ధ్వంసమైంది. అక్కడ పనిచేస్తున్న కూలీలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డారు. వీరిలో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు క్షతగాత్రులయ్యారు. శరీర భాగాలు చుట్టుపక్కల ముక్కలుముక్కలుగా పడ్డాయి. శరీర భాగాలు సుమారు కిలోమీటరు దూరంలో పడ్డాయంటే పేలుడు ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇళ్లు సైతం కంపించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. పేలుడు ధాటికి చుట్టుపక్కల ఇళ్ల గోడలు సైతం నెరలు తీశాయి. ఈ ఘటనతో స్థానికులు, చట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం ఉలిక్కిపడ్డారు. రాత్రి కావడంతో క్షతగాత్రులను గ్రామస్తులు తమ ద్విచక్ర వాహనాలపై తరలించాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, ఇతర మంత్రులు, డిఐజి పాల్‌రాజ్, ఏలూరు ఎస్‌పి రాహుల్ దేవ్‌శర్మ, పోలీసు సిబ్బంది, అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మృతుల కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా ఉండటంతో వాటిని చూసి విలపిస్తున్నారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా

మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని సిఎం జగన్ మోహన్‌రెడ్డి అమరావతి నుంచి ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశాలు జారీ చేశారు. రాత్రి సమయం కావడం, మృతదేహాలు ఛిద్రమవడంతో ఘటనకు కారణాలు, మృతుల పూర్తివివరాలు తెలియరాలేదు.

ఆక్వా ఫీడ్ ధరల నియంత్రణకు ప్రభుత్వం కృషి

రాష్ట్ర మత్స్య విశ్వవిద్యాలయం ఓఎస్‌డి డాక్టర్ సుధాకర్

ప్రజాశక్తి - ఉండి

ఆక్వా ఫీడ్ ధరపై నియంత్రణకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందని ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం ఓఎస్‌డి డాక్టర్ ఒ.సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక మత్స్య పరిశోధన కేంద్రంలో మూడు రోజులపాటు జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ సహకారంతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.నీరజ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో సుధాకర్ మాట్లాడుతూ రైతులకు మత్స్యశాఖ, ఫిషరీస్ యూనివర్సిటీ సంయుక్తంగా సేవలందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అందులో భాగంగానే రైతులతో నేరుగా సంబంధం కలిగిన గ్రామీణ మత్స్య శాఖ ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆక్వా ల్యాబ్ టెక్నీషియన్స్‌కు శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఫిషరీస్ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ రమణ మాట్లాడుతూ గ్రామీణ ఫిషరీస్ అసిస్టెంట్లు ఆక్వా రంగంలో ఎదురవుతున్న సమస్యలను, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వర్క్‌షాప్‌లో నిపుణుల దృష్టికి తీసుకొచ్చి వారి సూచనలు పరిగణలోకి తీసుకొని మంచి ఆక్వా ఉత్పత్తులు మార్కెట్లోకి వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. మత్స్య శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ కెఎస్‌వి నాగలింగాచారి మాట్లాడుతూ ఉండి మత్స్య పరిశోధనా కేంద్రం వల్ల ఫీల్డ్ అసిస్టెంట్లకు సాంకేతిక సమాచారం అందుకోవడానికి అనువుగా ఉందని పేర్కొన్నారు. మత్స్య పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నీరజ మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో ఆక్వాభివృద్ధికి మత్స్య పరిశోధనా కేంద్రం తన వంతు కృషి చేస్తోందన్నారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల పరిధిలోని గ్రామీణ ఫిషరీస్ అసిస్టెంట్, లేబరేటరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న శాస్త్రవేత్తలు

స్ఫూర్తిదాయకులు నాగటి నారాయణ

సంస్మరణ సభలో ఎంఎల్‌సిలు సాబ్జీ, ఐవి

ప్రజాశక్తి - భీమవరం

యుటిఎఫ్ సీనియర్ నేత నాగటి నారాయణ నాయకత్వంలో యుటిఎఫ్ అనేక ఫలాలను ఉపాధ్యాయులకు సాధించిపెట్టిందని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఎంఎల్‌సిలు ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీ అన్నారు. భీమవరం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నాగటి నారాయణ సంస్మరణ సభ గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ నేడు పదో తేదీ వచ్చినప్పటికీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడం లేదని, ఇదేమని అడిగిన ఉపాధ్యాయులను ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతోందని విమర్శించారు. బదిలీలు, ప్రమోషన్లు ఇవ్వకుండా కాలయాపన చేసిన ప్రభుత్వం ప్రస్తుతం దొడ్డిదారిన బదిలీలకు రంగంసిద్ధం చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ చరిత్రలో ఇంతదారుణమైన పిఆర్‌సి ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదని ఆక్షేపించారు. ప్రభుత్వ కేబినెట్ నిర్ణయాలు క్యాబినెట్ మంత్రులకే తెలియని పరిస్థితుల్లో రాష్ట్రం ఉందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నారాయణ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. నారాయణను స్ఫూర్తిగా తీసుకుని సంఘాలన్నీ ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇజ్రాయిల్ రాజు, జయప్రభ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఆధునీకరించిన యుటిఎఫ్ జిల్లా కార్యాలయాన్ని ఎంఎల్‌సిలు ప్రారంభించారు .

సకాలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి : జెసి

తాడేపల్లిగూడెం: సకాలంలో ధాన్యం కొనుగోళ్ల పక్రియను పూర్తి చేసి రైతులకు అండగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జెవి మురళి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం ఎంత ముఖ్యమో, సకాలంలో కొనుగోలు పక్రియను పూర్తిచేసి రైతులకు భరోసా కల్పించడం అంతే ముఖ్యమన్నారు. డిప్యూటీ తహశీల్దార్లు ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణతో పాటు, కల్లాలోకి వెళ్లి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు పక్రియను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎక్కడా గోనె సంచుల కొరత అనే మాట రాకూడదని పూర్తిస్థాయిలో సంచులను అందుబాటులో ఉంచామని తెలిపారు. తాడేపల్లిగూడెం ప్రాంతంలో మిగతా ప్రాంతాల్లో కన్నా ముందుగా వరి కోతకొస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు రైతు భరోసా కేంద్రాల్లో 35 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి పర్యవేక్షణకు జిల్లాలోని 35 మంది డిప్యూటీ తహశీల్దార్లను డిప్యూట్ చేసి విధులు కేటాయించడం జరిగిందన్నారు. పెంటపాడు, తాడేపల్లిగూడెం, తణుకు ప్రాంతాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ కుమారి డి.అఖిల, డిఎస్ఒ ఎన్.సరోజ, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ బి.బాల స్వామి, తహశీల్దార్ అప్పారావు, డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

భీమవరం :కేంద్ర ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలని కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికార మంత్రిత్వశాఖ విముక్తి సంచార, సెమీ సంచార జాతుల అభివృద్ధి సంక్షేమ బోర్డు సభ్యులు తురక నరసింహ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరు కార్యాలయలో సంక్షేమ పథకాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పేదల అభివృద్ధే దేశాభివృద్ధి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్‌సి ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇందిరా ఆవాస్ యోజన పథకం, ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛభారత్, టిడ్కో గృహాలు, బిసి, ఎ స్సి, ఎస్‌టి కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే నిధులు, అమృత్ పథకం వంటి వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, అంబేద్కర్, పూలే, భారతమాత, వివేకానంద చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

18న నరసాపురంలో సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి - మొగల్తూరు

ఈనెల 18న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మండల స్థాయి కార్యకర్తలకు ప్రభుత్వం చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. గురువారం సాయంత్రం మొగల్తూరులోని లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం వద్ద నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న నర్సాపురం జగన్మోహన్‌రెడ్డి పర్యటించనున్నారని, ఈ పర్యటనకు నాయకులు కార్యకర్తలు విధిగా హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడవులు సత్యనారాయణ, పాల రాంబాబు, రేవు రాంబాబు, బంధన తగిలేది పూర్ణచంద్రరావు, తన్నీడి గిరి, గుబ్బల నారాయణమూర్తి, సంకు రాము పాల్గొన్నారు.

నరసాపురంటౌన్ : నరసాపురం నియోజవర్గంలో సిఎం పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద్‌రాజు కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సన్ హాస్పటల్ నిర్వహణపై ఫిర్యాదు

వైద్య ఆరోగ్య శాఖ అధికారుల విచారణ

తాత్కాలికంగా మూసివేయాలని కలెక్టర్ నివేదిక

ప్రజాశక్తి - తణుకురూరల్

పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా సన్ హాస్పటల్ పేరుతో ఆసుపత్రిని ప్రారంభించి డాక్టర్ ఎస్.శోభాశరన్ వైద్యసేవలందిస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇటీవల విచారణ చేపట్టారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు విచారణలో భాగంగా ఆసుపత్రిని, సంబంధిత పత్రాలను పరిశీలించి ఆసుపత్రిని తాత్కాలికంగా మూసివేయాలని చెప్పి కలెక్టరుకు నివేదిక పంపారు. వివరాల ప్రకారం తణుకు బాబు గారి వీధి, శ్రీరామ పిల్లల ఆసుపత్రి ఎదురుగా ఉన్న, పాత హర్ష ఆసుపత్రిలో సుమారు 4 నెలల క్రితం సన్ హాస్పటల్‌ను ప్రారంభించి డాక్టర్ శోభాశరన్ వైద్య సేవలందిస్తున్నారు. సదురు వైద్యుడు బిపి, షుగర్, శ్వాసకోశ వ్యాధులు, విషజ్వరాలు, పాయిజనింగ్, పాముకాటు, థైరాయిడ్, కిడ్నీ సమస్యలు, స్ట్రోక్ (పెరాలసిస్) నిద్రలేమి సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు, జాయింట్ పెయిన్స్, జ్వరం, టైఫాయిడ్, డెంగీ, మలేరియా, దగ్గు (టిబి), లివర్ కామెర్లు, నీరుడు ఇబ్బంది, గ్యాస్ ట్రబుల్స్, ఉబ్బసం తదితర వ్యాధులకు వైద్యసేవలందిస్తున్నారు. అయితే ఆసుపత్రిలో దేనికి ఎంత ఛార్జీ చేస్తున్నారో డిసిప్లే బోర్డులు లేవు. అవుట్ పేషేంట్స్‌తో పాటు ఏకంగా ఇన్ పేషెంట్లను కూడా జాయిన్ చేసుకుంటున్నాడు. డాక్టర్ శోభాశరన్ ఫిలిప్పియన్స్‌లో మెడిసిన్ చేసినా, ఎమ్‌డీ ఫిజిషియన్‌గా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే అక్కడ ఎమ్‌డీ డిగ్రీ, మన దేశంలో ఎంబిబిఎస్‌తో సమానం, మెడికల్ కౌన్సిల్ వాళ్ళు కూడా రిజిస్ట్రేషన్ ఇచ్చేటప్పుడు పరీక్ష నిర్వహిస్తారు. ఆ పరీక్షలో శోభాశరన్ పాసయ్యారు. ఎపి మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్‌లో తాను చదివిన ఎమ్‌డీ ఇక్కడ ఎంబిబిఎస్‌తో సమానమని వారు ఇచ్చినప్పటికీ అది ఎక్కడా కూడా ఆసుపత్రిలో డిస్‌ప్లే చేయలేదు. అన్ని చోట్లా బోర్డులపై ఎమ్‌డీ అని పెట్టుకున్నాడు. క్లినిక్ నిర్వహించాలంటే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకుని పర్మిషన్ తీసుకోవాలని, సదరు వైద్యుడు ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకున్నాడని, ప్రోసెస్‌లో ఉంది కాని రిజిస్ట్రేషన్ రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, ఆసుపత్రిని తాత్కాలికంగా మూసివేయాలని అధికారులు చెప్పినప్పటికీ నిర్లక్ష్యంగా, బేఖాతరుగా ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. కేవలం సన్ హాస్పటల్‌ను మాత్రమే కాదు తణుకులో నిబంధనలకు విరుధంగా అనేక ఆసుపత్రులు ఉన్నాయి. ఎవరైనా ఆసుపత్రిపై అధికారులకు ఫిర్యాదులు చేసినప్పుడు మాత్రమే విచారణ చేస్తున్నారు. అందువలన కొన్ని ఆసుపత్రులు మాత్రమే ఈ విధంగా బయటపడుతున్నాయి. డాక్టర్ శోభాశరన్‌ను వివరణ కోరగా ఆయన ఫోన్లో మాట్లాడారు. ఆసుపత్రికి అన్ని అనుమతులూ ఉన్నాయని తెలిపారు. ఎవరో కిట్టని వారు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారన్నారు. అవి కల్పితాలని, సన్ ఆసుపత్రి ఎప్పటి లాగేనే రన్ అవుతుందని తెలిపారు.



ఆసుపత్రిలో విచారణ చేస్తున్న అధికారులు

ఆసుపత్రిని నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు

సన్ ఆసుపత్రి వైద్యులు ఫిలిప్పియన్స్‌లో ఎమ్‌డీ డిగ్రీ చేశారు. అయితే మన దేశంలో అక్కడ డిగ్రీ ఇక్కడ ఎంబిబిఎస్‌తో సమానం. కాని ఏర్పాటు చేసుకున్న బోర్డుల్లో ఎమ్‌డీగా చలామణీ అవుతున్నాడు. అయితే ఆసుపత్రిలో ఏ వైద్యానికి ఎంత ఛార్జీ వసూలు చేస్తున్నారో తెలిపే బోర్డులు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ఆసుపత్రికి రిజిస్ట్రేషన్ లేదు. అందువల్ల తాత్కాలికంగా ఆసుపత్రిని మూసివేయాలని ఆదేశించాం. ఆదేశాలను లెక్కజేయకుండా ఆసుపత్రిని నిర్వహిస్తే తగు చర్యలు తీసుకుంటాం.

వాన్‌బరి కార్మికులకు కుదిరిన వేతన ఒప్పందం

ప్రజాశక్తి - తణుకురూరల్

వాన్‌బరి లిమిటెడ్ (డిఒసి)లో యాజమాన్యానికి స్టాఫ్, వర్కర్స్ యూనియన్(సిఐటియు)కు మధ్య 2022 నుండి 2024 వరకు నూతన వేతన ఒప్పందం జరిగిందని సిఐటియు నాయకులు పివి.ప్రతాప్, కార్యదర్శి వల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఏలూరు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్(జెసిఎల్) వారి సమక్షంలో యాజమాన్యం ప్రతినిధులు, యూనియన్ నాయకులు వేతన ఒప్పందపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ ఇప్పుడున్న వేతనాలపై ప్రతీ కార్మికుడికి ఈ ఏడాది రూ.2500, వచ్చే సంవత్సరం రూ.2500 పెరుగుతుందని, పెరిగిన వేతనంలో 40 శాతం బేసిక్‌లో కలుపుతారన్నారు. విడిఎ చట్టప్రకారం రూ.6.65 పైసలు ఉంటే దానిని రూ.ఏడుకు పెరిగిందని, ఓటీ తొలగించాలని చేసిన ప్రయత్నం కార్మికులు తిప్పికొట్టారని, గతంలో మాదిరి గ్రాస్‌పై డబుల్ కొనసాగుతుందని తెలిపారు.

ఇవే ఒప్పందాలు..

-ఎల్‌టిఎ లాంగ్ ట్రావెల్ అలవెన్స్ ఈ రెండేళ్ల కాలంలో రూ.2500 ఇస్తారు, టూర్ వెళ్లినా, వెళ్లకపోయినా కార్మికుల జీతంలో కలుపుతారు.

-డైలీ వేజ్ కార్మికులను ఈ రెండేళ్ల కాలంలో ఆరుగురిని పర్మినెంట్ చేశారని, కార్మికులు సర్వీస్ 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వరకూ కొనసాగిస్తారు.

-తల్లిదండ్రుల ఆరోగ్యం నిమిత్తం యాజమాన్యం ఒక డాక్టర్‌ని నియమిస్తుంది. నెమ్మదిగా ఇతర సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తారు.

- ఇఎల్ఎస్ గతంలో ఉన్నదాన్ని తొలగించి ఎప్పుడైనా సెలవు పెట్టుకొనే అవకాశం ఇచ్చారు.

-బోనస్ ఈ సంవత్సరం రూ.10,500, వచ్చే సంవత్సరం రూ.11 వేలు ఇస్తారు.

ప్రతీ సంవత్సరం రెండు జతల బట్టలు, రెండు జతల షూస్ ఇస్తారు.

-కార్మికులకు యాజమాన్యం వెంటనే రెస్ట్ రూమ్‌ని ఏర్పాటు చేస్తారు.

ప్రతీ ఆరు నెలలకు ఒకసారి పెరుగుతున్న విడిఎ పాయింట్లను బేసిక్‌లో కలుపుతారు.

-నైట్ షిఫ్ట్ అలవెన్స్ రూ.75 ఇస్తారు.

-కార్మికులకు ఏదైనా ఇబ్బంది వస్తే అప్పుడు 11 రోజులు సెలవులు ఇస్తారు.

ఈ విధంగా రెండు సంవత్సరాల అగ్రిమెంట్ జరిగిందని ప్రతాప్ తెలిపారు. యాజమాన్యం ప్రతినిధులు పరిశ్రమల శాఖ జిఎం ఎంవివిఎస్.మూర్తి, డిజిఎం టి.వెంకటేశ్వరరావు, సిహెచ్ వెంకటేశ్వరరావు, ఏలూరు జిల్లా సిఐటియు కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్, యూనియన్ నాయకులు పి.దక్షిణామూర్తి, గుబ్బల గోపి, వైటి రామకృష్ణ పాల్గొన్నారు.


బాధితులకు సాయం అందజేస్తున్న సభ్యులు

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - పోడూరు

షార్ట్ సర్క్యూట్ కారణంగా వేడంగిలోని ఎస్సి పేటకు చెందిన రావి రామకృష్ణ తాటాకిల్లు దగ్ధమైంది. గురువారం జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం, 25 కేజీల బియ్యం అందజేశారు. అలాగే జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం, 25 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుమంగళి, మండల కన్వీనర్ గణపతి రాజు, డిటిడిసి బాబు, పెద్రా ఆంజనేయులు, కొట్టు రాము, పెందుర్తి చరణ్, పాలపర్తి రాము పాల్గొన్నారు.


పాఠశాలకు వంట సామగ్రి అందజేస్తున్న అశోక్ దంపతులు

పాఠశాలకు వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు జిష్ణు ఉమా కార్తికేయ మొదటి పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు కరక అశోక్, దివ్య దంపతులు రూ.25 వేల విలువైన వంట సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వైసిపి నాయకులు రావాడ సతీష్ మాట్లాడుతూ పాఠశాలకు వంట సామగ్రి అందజేసిన కార్తికేయ తల్లిదండ్రులను అభినందించారు. దాతలు పాఠశాలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ అధ్యక్షులు అల్లు శ్రీను, పోతాబత్తుల సత్యనారాయణ, కొనిజేటి శ్రీహరి ప్రసాద్, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఓపులాపురపు సుబ్బరాజు నాగలక్ష్మి రాజేశ్వరి పాల్గొన్నారు.


విద్యార్థులకు యూనిఫారాలు అందజేసిన జెడ్‌పి ఛైర్మన్

విద్యార్థులకు యూనిఫారాలు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఎన్నో దశాబ్దాలుగా పేదలకు సత్రాలు చేస్తున్న దానధర్మాలు అభినందనీయమని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. పట్టణంలోని ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్షీరపురి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సి కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద్ ప్రకాష్, సాల నర్సయ్య, చందక సత్తిబాబు, అన్నదాన సమాజం ఇఒ ఎవివి సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లు : పేదలు నైపుణ్యాభివృద్ధితో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. క్షీరపురి అన్నదాన సమాజం సౌజన్యంతో ఛాంబర్ కళాశాలలో డిగ్రీ, ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థులకు ఉచిత యూనిఫాం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు, సెక్రటరీ కలిదిండి రామరాజు ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, ఇఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎఐటియుసి మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అఖిల భారత భవననిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ 7వ మహాసభలను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం ఏరియా తాపీ, వడ్రంగి, సెంటరింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ మేస్త్రీల సమావేశం ఏరియా కమిటీ అధ్యక్షులు పడాల శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం సిపాయి పేట భవననిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో నిర్వహించారు. రాజమండ్రి ర్యాలీని దృష్టిలో ఉంచుకుని ఈసారి నెలవారీ సెలవును డిసెంబర్ 1వ తేదీకి బదులుగా నవంబర్ 26వ తేదీన వినియోగించుకోవాలని, డిసెంబర్ 1వ తేదీన పనిదినంగా పరిగణించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు మాట్లాడుతూ మహాసభ ప్రారంభం సందర్భంగా 26వ తేదీన రాజమండ్రిలో జరిగే భారీ ప్రదర్శనకు కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ పార్లమెంటు ఆమోదం ద్వారా కేంద్రప్రభుత్వం తెచ్చిన వెల్ఫేర్ బోర్డుచట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి మెండెం జేమ్స్, ఏరియా కమిటీ ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ పాల్గొన్నారు.

బంగారయ్యకు జీవన సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసి పురస్కారాలు అందుకోవడంలో బంగారయ్య చరిత్ర సృష్టించారని పాలకొల్లు మాజీ శాసనసభ్యులు త్సవటపల్లి సత్యనారాయణ (బాబ్జి) అన్నారు. ఆయుర్వేద జ్యోతి, ఆరంభం పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో పాలకొల్లు మాంటిస్సోరీ పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో బంగారయ్యకు జీవన సాఫల్య పురస్కారం అందజేశారు. స్థానిక విలేకరులకు బంగారయ్య ఈ వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాబ్జి మాట్లాడారు. పాలకొల్లులో ప్రభుత్వం ఆయుర్వేద కళాశాల ఏర్పాటు చేయాలని అందుకోసం ముఖ్యమంత్రి ఉత్తరాల ఉద్యమం ప్రారంభిస్తామని చెప్పారు. జాతీయ వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ రావూరి సుధ, లైన్స్ బెస్ట్ గవర్నర్ అవార్డు గ్రహీత కర్రా సరిత, మాంటిస్సోరి పాఠశాల నిర్వాహకులు మద్దాల వాసు బంగారయ్యకు పురస్కారం అందజేశారు.


బంగారయ్య దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

వీధి దీపాలు.. ఏర్పాటు చేయరూ..!

ప్రజాశక్తి - నర్సాపురం టౌన్

పట్టణంలోని 28 వార్డులో క్రిస్టియన్ పేట కాలువ గట్టు ప్రాంతంలో గతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. వైర్లు వేయకుండా అలాగే వదిలేశారు. దీంతో వీధి దీపాలు లేక రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నామని వార్డు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయి పూర్తిగా రోడ్డును ఆక్రమించాయని తెలిపారు. పిచ్చి మొక్కల వల్ల పాములు సంచరించడంతో భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నామని, రాత్రి అయితే బయటకు రావడానికి భయపడుతున్నామని వాపోతున్నారు. అధికారుల స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేసి ఇబ్బంది లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.


విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పిచ్చిమొక్కలు

భూముల సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - అత్తిలి

మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ సంరక్షణ కార్యక్రమంపై గ్రామ సర్వేపై విఆర్ఒ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహనా సదస్సు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రామాంజనేయులు, ఎంపిడిఒ రామారావు మాట్లాడుతూ సర్వే ప్రాముఖ్యత, ప్రక్రియ గురించి వివరించారు. ముఖ్యంగా గ్రామకంఠం భూములు సరిహద్దులు గురించి నిర్ణయించడం, రాళ్లు పాటించడం, సర్వే సంబంధిత జారీ చేయడం, నోటీసులు గురించి, చలనం మార్కింగ్ చేయడం వంటి ప్రక్రియ గురించి వివరించారు. సర్వే ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లే విధానం గురించి అవగాహన కల్పించారు. ఓఆర్ఐ మ్యాప్, ఓఆర్ఐ క్వాలిటీ పరిశీలన ట్రేడింగ్ గురించి, గ్రౌండ్ టు తిలక్ ,13వ నోటిఫికేషన్ గురించి వారు వివరించారు.



వృద్ధాశ్రమానికి నిత్యావసరాలు అందజేస్తున్న ఆనందవర్మ

ఘనంగా ఆనందవర్మ పుట్టినరోజు

ప్రజాశక్తి - ఉండి

వైసిపి సీనియర్ నాయకుడు, సంఘ సేవకులు ఐ భీమవరం గ్రామానికి చెందిన కనుమూరి ఆనంద వర్మ పుట్టినరోజు వేడుకలు మహాదేవపట్నం గ్రామంలోని సన్ రైజ్ వృద్ధాశ్రమంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేకు కట్ చేసిన ఆనంద వర్మ వృద్ధులతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమానికి నాలుగు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, 150 కేజీల బియ్యం, రూ.10,000 వేల నగదు తన కుమార్తెతో కలిసి నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద వర్మ మాట్లాడుతూ తన పుట్టినరోజు వృద్ధాశ్రమంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. వైసిపి శ్రేణులు నా పుట్టినరోజును చాలా చోట్ల జరిపారని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు.


విజయలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

మహిళల అభ్యున్నతికి విజయలక్ష్మి కృషి

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళల అభ్యున్నతికి, వారిని చైతన్యపర్చేందుకు ఎంతో కృషి చేసిన ఘనత విజయలక్ష్మిదేనని ఐద్వా పట్టణ కార్యదర్శి సందక ఉదయ కుమారి అన్నారు. ఐద్వా జిల్లా మాజీ కార్యదర్శి జి.విజయలక్ష్మి రెండో వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఐద్వా నాయకురాలు దోకల లక్ష్మి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ పట్టణ కార్యదర్శి సందక ఉదయకుమారి మాట్లాడుతూ విజయలక్ష్మి మహిళలపై జరిగే అత్యాచారాలను ఎప్పటికప్పుడు ఖండించి, మహిళలను చైతన్య పర్చారన్నారు. ఈ కార్యక్రమంలో గేదెల లావణ్య, బి.కళ్యాణి, మనీ, జి.కన్నాంబ, కె.ఆదిలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.


వరప్రసాద్‌ను పరామర్శిస్తున్న అంగర్ రామ్మోహన్‌రావు

వరప్రసాద్‌కు అంగర పరామర్శ

యలమంచిలి:కొంతేరు గ్రామానికి చెందిన ప్రముఖులు కర్రా వరప్రసాద్ తల్లి, మాజీ సర్పంచి కర్రా సాంబయ్య సతీమణి సావిత్రమ్మ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాన్ని ఎంఎల్‌సి అంగర గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా అంగర మాట్లాడుతూ సావిత్రమ్మ భర్త సాంబయ్య సర్పంచిగా, గ్రామ పెద్దగా ప్రజలకు సేవలందించారని తెలిపారు. అన్ని విషయాల్లో సావిత్రమ్మ ఆయనకు ఎన్ను దన్నుగా ఉండేవారని గుర్తు చేశారు. ఆయన వెంట నాయకులు ఉన్నమట్ల కబర్ది, పెచ్చెట్టి కృష్ణాజీ, పులపర్తి వెంకటరమణ ఉన్నారు.

14న మాజీ మంత్రి లక్ష్మణరావు శత జయంతి

నరసాపురం :మాజీ మంత్రి పెదసింగు లక్ష్మణరావు శత జయంతి వేడుకలను జయప్రదం చేయాలని అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు తెలిపారు. ఈ నెల 14వ తేదీ సోమవారం మచిలీపట్నం కోనేరు కూడలి వద్ద లక్ష్మణరావు శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నారని, నర్సాపురం నియోజకవర్గం నుండి అగ్నికుల క్షత్రియులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా అగ్నికుల క్షత్రియ అధ్యక్షులు కొల్లాటి కేశవర్ధన రాజు, యూత్ ఫోర్స్ పట్టణ అధ్యక్షులు కొప్పాడ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లాడి బాలు పాల్గొన్నారు.


మానసిక వికలాంగులకు సామగ్రి అందజేస్తున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాస్

మానసిక వికలాంగులకు ఎయిర్ బ్యాగ్స్ అందజేత

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి మానసిక వికలాంగుల కేంద్రంలో క్షీరపుర అన్నదాన సమాజం వారి సౌజన్యంతో వికలాంగులకు రూ.40 వేల విలువైన సైకిల్, స్టిమిలేటర్ మోటార్, ఎయిర్ బ్యాగ్స్ గురువారం జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ క్షీరపురి అన్నదాన సమాజం వారు మానసిక వికలాంగులు ఇతర పిల్లల మాదిరిగానే వారు కూడా ఆట పాటలతో సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో వారికి ఆట వస్తువులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రావూరి వెంకటరమణ బుజ్జి, చివటపు నాగేశ్వరరావు, అన్నదాన సమాజం ఇఒ ఎవివి సత్యనారాయణ, ఛైర్మన్ మామిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి చేయూత

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని దీప్తి స్కూల్లో ప్రతిభా పేద విద్యార్థిని పైబోను దివ్య కృష్ణ సత్యశ్రీకి యునైటెడ్ కాపు క్లబ్ తరపున రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. క్లబ్ తరపున బ్లడ్ డోనర్ సొసైటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ ముచ్చర్ల సంజయ్, అధ్యక్షులు పెనుమాక రామ్మోహన్, సెక్రటరీ జక్కంపూడి మదన్ పాల్గొన్నారు


విద్యార్థిని తల్లికి సాయం అందజేస్తున్న సభ్యులు

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి


పెనుమంట్ర :పరీక్షలు చేస్తున్న డాక్టర్ లావణ్య

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇంటింటికీ వైద్య విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెనుమంట్ర పిహెచ్‌సి డాక్టర్ వై.అనూష అన్నారు. సోమరాజు ఇంల్లిద్రపర్రులో గురువారం 104 వైద్య సేవల ట్రైల్ రన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం ద్వారా వైద్య సేవలు పొందాలన్నారు. డాక్టర్ లావణ్య మాట్లాడుతూ గ్రామంలో 45 మందికి పరీక్షలు చేయడమే కాకుండా గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలకు, లేవలేనివారికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సురేష్ బాబు, ఎంపిహెచ్ఎస్ఎఫ్‌యు వెంకట్రావు, ఎఎన్ఎం మహాలక్ష్మి, ఆశా వర్కర్లు ప్రశాంతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆచంట : ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని కె.హైందవి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం కరుగోరుమిల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ వీరమ్మ ఎంఎల్‌హెచ్ పి.సాయికుమారి, ఎంపిహెచ్ఎ ఎం.నాగేశ్వరరావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : బల్లిపాడు గ్రామ సచివాలయం పరిధిలో హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.నవ్యజీవన్ నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు, శిశువులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు, అధిక రక్తపోటు, మధుమేహం కంటిచూపు, మలేరియా, డెంగీ అయోడిన్ శాతం తెలిపే పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అంజదేశారు. ఈ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 14 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి భూపతిరాజు ఇందిరాదేవి గోపాలరాజు, 104 వాహనం వైద్యాధికారి డాక్టర్ పివి నారాయణ పాల్గొన్నారు.


ఆచంట : వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హైందవి